క్లుప్తంగా

ఫిజియోథెరపి సేవలు ప్రారంభం



ఫిజియోథెరపిని ప్రారంభించిన ఎంఈవో

పూసపాటిరేగ : ఫిజియోథెరపి సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బి.పాపి నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపి సేవలను లాంఛనంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు శారీరక వైకల్యం, మస్తిష్క పక్షవాతం గల దివ్యాంగ విద్యార్థులకు ప్రతి బుధవారం ఫిజియోథెరపి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదిలికలకు సంబంధించిన సమస్య వుంటే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ రమాచంద్రిక, ప్రత్యేక ఉపాధ్యాయులు బంగారునాయుడు, వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అనధికారిక నిర్మాణాన్ని తొలగించిన కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: ప్రభుత్వ నిబంధనల మేరకే లేఅవుట్లలో ఎటువంటి నిర్మాణాలనైనా చేపట్టాలని, అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగించి వేస్తామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని పావనీనగర్ లేవుట్‌లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకున్నారు. ప్రణాళిక అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తించడంతో పాటు, అక్రమ నిర్మాణం జరుగుతున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు భవన నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అక్రమ నిర్మాణాలు కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లో నిర్మాణాలు జరగాలని లేని పక్షంలో చర్యలు తప్పవని తెలిపారు.

ఐటీఐలలో 4వ విడత ప్రవేశాలకు ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 25 ప్రైవేటు ఐటీఐలలో ఆగస్టు-2025 సెషన్ 4వ విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ కన్వీనర్ టీవీ గిరి ప్రకటించారు. అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం వచ్చిన యూనిక్ నెంబర్‌తో ఈ నెల 28వ తేదీలోపు సమీప ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరయి వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐలకు ఈ నెల 29న, ప్రైవేటు ఐటీఐలకు ఈ నెల 30న కౌన్సెలింగ్ జరగనుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9849118075, 9849944654, 7780658035 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

విజయనగరం అర్బన్: స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జిల్లా తరపున పట్టణానికి చెందిన సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థులు వివిధ క్రీడాంశాలలో ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ పుష్పామేరీ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపి ఎంపికయ్యారని తెలిపారు. రోలర్ హాకీ అండర్ -14 కేటగిరి జట్టులో ఏడుగురు, బాక్సింగ్ అండర్-17 కేటగిరి 80 ప్లస్‌లో పి.గోవర్ధన్, అండర్-14 కేటగిరి 42 ప్లస్‌లో వి.యశ్వంత్ ఉన్నారు. తైక్వాండో అండర్-17 కేటగిరిలో టి.మరియా కేలిత, బి.దీక్షిత్, వీఎంకేకే మేఘ వర్మ, ఎ.లోహిత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరం

నెల్లిమర్ల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే రోగాలకు దూరంగా ఉండొచ్చని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మ దినోత్సవం సందర్భంగా స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని చెప్పారు. మేనరికం, బాల్య వివాహాల వల్ల అనారోగ్యంగా ఉన్న పిల్లలు పుడుతున్నారని చెప్పారు. పంటలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తిరుమలదేవి, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ జయరాం, ఎంపీడీవో శంకర్ జగన్నాథం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు, శేఖర్, విజయశాంతి, తదితరులు పాల్గొన్నారు.

పీ 4కు బలవంతపు మార్గదర్శకులు

- నలహాలు ఇవ్వడానికే అంగీకరించిన వైనం
- బంగారు కుటుంబాలకు న్యాయంపై సందేహాలు
- ఆసక్తి చూపని ఉన్నత వర్గాలు, పారిశ్రామికవేత్తలు



పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయం

పూసపాటిరేగ : నిరుపేద కుటుంబాలలో పేదరికం రూపుమాపి ఆర్థికంగా భరోసా ఇచ్చి కుటుంబాలలో వెలుగులు నింపడానికి ప్రవేశపెట్టిన పీ 4(పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్) పథకం లక్ష్యం నీరుగారుతోంది. పథకం లక్ష్యాలకు అమలుకు పొంతన లేకుండా పోయింది. పథకంలో ధనికులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఆర్థికంగా స్థాయిలో వున్న ప్రతినిధులు, విదేశాలలో స్థిరపడిన వ్యక్తులు పేదరికంలో వున్న కుటుంబాలను దత్తత తీసుకొని ఆయా కుటుంబాలలో పిల్లలకు విద్య, వైద్యం, ఉపాధితో పాటు ఆయా కుటుంబాలలో ఆర్థికంగా జీవన ప్రమాణాలు మెరుగుపరచడం పీ 4 పథకం లక్ష్యం. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా వుంది. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో బలవంతపు దత్తతతో ఉద్యోగులు మెడపై కత్తిపెట్టి బలవంతపు దత్తతను అంటగట్టారు. బంగారు కుటుంబాలకు కేవలం ఉచిత సలహాలు ఇవ్వడానికి మాత్రమే మార్గదర్శకులుగా అంగీకరించిన పరిస్థితి నెలకొంది.

పూసపాటిరేగ మండలంలో బీపీఎల్ సర్వేలో ఎంపిక చేసిన 2454 బంగారు కుటుంబాలను 398 మంది మార్గదర్శకులకు దత్తత తీసుకున్నట్టు రికార్డులు తయారయ్యాయి. భోగాపురం మండలంలో 2806 కుటుంబాలు, 476 మంది మార్గదర్శకులు, నెల్లిమర్ల మండలంలో 1693 కుటుంబాలు, 180 మంది మార్గదర్శకులు, డెంకాడ మండలంలో 1962 కుటుంబాలు, 252 మార్గదర్శులు నియమాకాలు జరిగాయి. అయితే వీరంతా కేవలం సలహాలు ఇవ్వడానికి మాత్రమేనని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 8915 బంగారు కుటుంబాలు వుండగా 1306 మందిని మార్గదర్శులుగా నియమించారు. బంగారు కుటుంబాలలో పేదరికాన్ని నిర్మూలించడానికి మార్గదర్శకులు తమ వంతుగా సహకారం అందించాలి. కానీ పరిస్థితి చూస్తే కేవలం నామమాత్రపు దత్తత మాదిరిగానే వున్నట్టు కనిపిస్తుంది. బంగారు కుటుంబాలుగా బ్యాంకు ఖాతా లేని కుటుంబాలు, ఇళ్లు లేని కుటుంబాలు, విద్యుత్ సౌకర్యం లేని కుటుంబాలు, ఆర్థికంగా వెనకబడిన వారిని గుర్తించారు. బంగారు కుటుంబాలు సర్వే పూర్తి చేసినప్పటికీ మార్గదర్శకులు దత్తత దగ్గరే అసలు తంటా వచ్చింది. దత్తత తీసుకోవడానికి పారిశ్రామిక వేత్తలు, ధనికులు, ఆర్థికంగా ఎదిగిన వ్యక్తులు రాకపోవడంతో సచివాలయ ఉద్యోగులతో బలవంతపు దత్తత చేసిన పరిస్థితి. కేవలం మెంటార్సుగానే ఉద్యోగులు వుండటానికి అంగీకరించినట్టు సమాచారం. ఆర్థికంగా ఎదిగిన పారిశ్రామిక వేత్తలు, సంపన్న వర్గాలు, ఉన్నత ఉద్యోగులను మార్గదర్శకులుగా చేసినట్లయితే కొంత మేర పథకం ఫలితం ఇవ్వవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం రూ.25 వేల నుండి 30 వేలు జీతం వచ్చే సచివాలయం ఉద్యోగులు మెడకు పీ 4 దత్తతను అప్పగించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పీ 4 అమలు చేస్తున్నాం..



పీ 4 పథకాన్ని అమలు చేయడానికి అందరిని భాగస్వాములు చేస్తున్నాం. ఇప్పటికే సంపన్న వర్గాలు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వంలో ఉన్నత ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు వివరాలు తీసుకున్నాం. సచివాలయం ఉద్యోగులను మార్గదర్శకులుగా నియమించాం. బంగారు కుటుంబాలు గుర్తించాం. పథకం అమలుకు సమర్థవంతంగా కృషి చేస్తున్నాం.

– ఎం.రాధిక, ఎంపీడీవో, పూసపాటిరేగ

బాలికలు, మహిళల భద్రతే లక్ష్యం

- ఏఎస్పీ సౌమ్యలత



సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్ : బాలికలు, మహిళ భద్రతే పోలీసుల లక్ష్యమని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌమ్యలత అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో లైంగిక వేధింపులు – మహిళల భద్రతపై విద్యార్థులు, యూనివర్సిటీ అధ్యాపకులకు, సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పీ మాట్లాడుతూ మహిళల మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు తోడుగా ఉన్నట్టేనని అన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్‌ను ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసులు ఆపదలో ఉన్న ప్రాంతానికి చేరుకొని రక్షణగా నిలుస్తారన్నారు. మహిళల భద్రతకు ఈ యాప్‌లో సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఉందన్నారు. శక్తి యాప్‌కు సంబంధించి రూపొందించిన రెండు వీడియోలను తెరపై ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీలో సగం మంది మహిళా ఉద్యోగులు, సిబ్బంది లేదా విద్యార్థినులు ఉండాలన్నారు. కమిటీ మూడు నెలలకొకసారి సమావేశం కావాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ మహిళల భద్రత, లైంగిక వేధింపుల నిరోధం ప్రతి విద్యా సంస్థలో అత్యంత ప్రధాన అంశమన్నారు. యూనివర్సిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ చైర్మన్ డాక్టర్ పి.శ్రీదేవి మాట్లాడుతూ మహిళల భద్రత, పని స్థల రక్షణ కోసం కమిటీ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్‌చంద్ర బాబు, గ్రంథాలయాధికారి డాక్టర్ శంకర్‌రెడ్డి కొల్లె, విభాగాధిపతులు డాక్టర్ అనిరుధ్‌కుమార్, డాక్టర్ సురేష్‌బాబు, ఐసీసీ సభ్యులు డాక్టర్ దివ్యం కె, డాక్టర్ ప్రామా చటర్జీ, డాక్టర్ కళ్యంపూడి లత, డాక్టర్ కుసుమ్, విజయనగరం టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దాం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎంపీ, జేసీ

విజయనగరంఫోర్ట్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమన్నారు. స్థానిక ఘోషాస్పత్రిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి మహిళా ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యవంతమైన మహిళ ఒక శక్తివంతమైన కుటుంబానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినం రోజున ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణకు పరిపాలన యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం ద్వారా తల్లుల ఆరోగ్యం, శిశు పోషణ, కుటుంబ సంక్షేమం లక్ష్యంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్ఎంవో డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి, ఐసీడీఎస్ పి.డి టి.విమలారాణి, డాక్టర్ సుబ్రమణ్యం, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పూసపాటిరేగ : పంచాయతీరాజ్ ఉద్యోగులు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏపీ ఎన్జీవో ఉద్యోగులు సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా ఏపీ ఎన్జీవో సంఘం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 18న రాష్ట్ర ఉన్నతాధికారులను సంఘ నాయకత్వం కలిసి సమస్యలు విన్నవిస్తారన్నారు. పెండింగ్‌లో వున్న పీఆర్‌సీకి కమిటీ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో ప్రతినిధులు కొమ్మూరు దుర్గారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో రంగ కార్మికులను ఆదుకోవాలి

నెల్లిమర్ల: ప్రభుత్వం ఆటో రంగ కార్మికులను ఆదుకొని, ఉపాధి చూపించాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం జరజాపు పేట, మొయిద జంక్షన్, రామతీర్థం జంక్షన్‌లో స్థానిక ఆటో కార్మికులు బంద్ పాటించి ప్రభుత్వం ఆదుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామారావు మద్దతు పలికి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్ పథకం ఆటో రంగ కార్మికులపై ప్రభావం పడి ఉపాధి లేకుండా చేసిందన్నారు. ముఖ్యంగా రోజు ప్రయాణికులను రవాణా చేసే ఆటో కార్మికులు, టాటా మేజిక్ వంటి వాహనాలు ఆయా కుటుంబాలు ఉచిత బస్ ప్రయాణం వారిని రోడ్డు మీదకు లాగిందన్నారు. ఆటో రంగ కార్మికులకు రూ.25వేలు ఇచ్చి ఆదుకోవడంతో ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. కాకుంటే ఆటో కార్మికులతో తీవ్ర ఉద్యమం చేపట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు వై.సన్యాసి, జి.గంగరాజు, బి.సూర్య, బి.సోంబాబు, ఎం.అప్పన్న, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత : కమిషనర్

విజయనగరం: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. స్థానిక బొంకుల దిబ్బ వద్ద స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజారోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిరంతరం పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి ఉంచే విధంగా ప్రజలలో విస్తృత చైతన్యం తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఇదేం నూతన సంస్కృతి

- ఫ్లెక్సీల ఏర్పాటులో బీజేపీ కవ్వింపు చర్యలు తగవు
- కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేష్



ఫ్లెక్సీ వివాదంపై మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ రాజేష్, ఇతర సభ్యులు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం పట్టణంలో ఫ్లెక్సీలు విషయంలో బీజేపీ కార్యకర్తలు గతంలో ఎన్నడూ లేని విధంగా శాంతి భద్రతలు సమస్యను సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారని ఇటువంటి కవ్వింపు చర్యలు మానుకోవాలనీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి.రాజేష్ అన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా పార్టీ ఫ్లెక్సీలు మీద ఫ్లెక్సీలు కట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రధానమంత్రి జన్మదినం పురస్కరించుకుని బీజేపీ నాయకులు పెట్టిన ఫ్లెక్సీలు మా పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణికి శుభాకాంక్షలు తెలుపుతూ పెట్టిన ఫ్లెక్సీల మీద పెట్టడం సరికాదన్నారు. నగర పాలక సంస్థ అనుమతితో ఫ్లెక్సీలు తాము ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. మా ఫ్లెక్సీలు మీద బీజేపీలో ఉంటూ రౌడీలుగా వ్యవహరిస్తున్న వారు ఫ్లెక్సీలు కట్టి మోదీని అవమానిస్తున్నారన్నారు. మోదీ పేరు చెప్పి దిగజారుడు రాజకీయం చేయడం తప్పన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, కార్పొరేటర్లు జీవీ రంగారావు, ఎస్.నారాయణస్వామి, పట్నాన పైడిరాజు, చందక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మనందరి మార్గదర్శి విశ్వకర్మ



విజయనగరం: విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పూజలు చేస్తున్న కోలగట్ల శ్రావణి

విజయనగరం: ప్రపంచానికి సృష్టికర్త, శిల్పకళా నిపుణుడు, వాస్తుశాస్త్ర పితామహుడుగా గౌరవింపబడే విశ్వకర్మ మహర్షి స్ఫూర్తి మనందరికీ మార్గదర్శకమని నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. నగరంలోని బొండాడ వీధిలో గల శ్రీమహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో గల స్వర్ణకార సంఘ భవనంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ యజ్ఞపూజ మహోత్సవంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, శిల్పకళ, వృత్తి పరమైన నైపుణ్యాలకు విశ్వకర్మ ఆరాధన ఎంతో ప్రేరణనిస్తుందన్నారు. నేటి సమాజంలోని వృత్తి నిపుణులు, శిల్పులు, కార్మికులు అందరికీ గౌరవప్రదమైన స్థానం కలిగించే విశిష్ట దినంగా అభిలాషించారు. జిల్లా అభివృద్ధిలో కార్మికులు, శిల్పులు, వృత్తిదారుల పాత్ర అమోఘమని, వారి శ్రమ, కృషి, ప్రతిభతోనే సమాజం సుస్థిర అభివృద్ధి సాధిస్తోందని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, సభ్యులు లక్కోజు అప్పలరాజు, శేఖర్, బంగారి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ప్రత్యేక పూజలు

భోగాపురం: విశ్వకర్మ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని మార్కెట్ సెంటర్ మెకానిక్ గ్యారేజ్ వద్ద శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సహకార సంఘం ప్రెసిడెంట్ పోలవరపు ప్రకాష్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు బుధవారం విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన విశ్వకర్మ మిత్రులు, పెద్దలతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

పూసపాటిరేగ : మండల కేంద్రం పూసపాటిరేగ పాత జాతీయ రహదారిలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వకర్మ విగ్రహాన్ని పూసపాటిరేగ పురవీధులలో ఊరేగిస్తూ ఆలయంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పునర్వసు పట్టాభిషేకం



స్వామి సన్నిధిలో పునర్వసు పట్టాభిషేక పూజలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం ఆలయంలోని వెండి మండపం వద్ద సీతారాముల కల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తుల వద్ద రామాయణంలో పట్టాభిషేక సర్గ విన్నవించి, స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో పతంజలి కంపెనీ అధ్వర్యంలో ఉద్యాన శాఖాధికారిణి బి.ఉమ భరణి ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఏప్రిల్ నెల నుంచి పతంజలి కంపెనీ వారు ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు అందజేస్తారన్నారు. ఒక హెక్టార్‌కి ఆయిల్ పామ్ సాగుకు గరిష్టంగా రూ.29,000లు సబ్సిడీ ఉంటుందన్నారు. అంతర పంటలు, పంట నిర్వాహణ కొరకు ఒక హెక్టార్‌కి రూ10,500లు చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు సబ్సిడీ ఉందని తెలిపారు. నీటి సదుపాయం ఉన్న రైతులే కాకుండా చిన్న, సన్నకారు రైతులందరూ ఆయిల్ పామ్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పతంజలి కంపెనీ ప్రతినిధులు, ఉద్యాన సహాయకురాలు చందన, రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా ఏజెంట్ల నియామకానికి ఆహ్వానం

విజయనగరం గంటస్తంభం: విజయనగరం డివిజన్ తపాల శాఖ పరిధిలో తపాల జీవిత బీమా, గ్రామీణ తపాల జీవిత బీమా ఏజెంట్లుగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 26 వరకూ అభ్యర్థులు తమ బయోడేటా, ఫొటో, ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. నియామకం పూర్తయిన ఏజెంట్లకు పాలసీననుసరించి కమీషన్ ఇవ్వనున్నామని, నెలవారీ జీతం ఉండదని స్పష్టం చేశారు. 5వేల జనాభాకు తక్కువగా ఉన్న ప్రాంతంలో పదో తరగతి, 5 వేల జనాభాకు పైన ఉన్న ప్రాంతంలో ఇంటర్ ఉత్తీర్ణులై, మార్కెటింగ్, ఇన్సూరెన్స్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

భోగాపురం: గత కొంత కాలంగా పక్షవాతంతో మంచానికే పరిమితమైన మండలంలోని పోలపల్లి గ్రామానికి చెందిన ఎస్.అజయ్‌కుమార్‌కు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.42,193 చెక్కును ఎమ్మెల్యే లోకం నాగమాధవి బుధవారం తన స్వగృహంలో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రోతు శ్రీనివాస్, పిల్లా కుమారి, పతివాడ బంగారాజు(పండు), చింతపల్లి మురళీ పాల్గొన్నారు.

ప్రతికూల ప్రభావాలను రిపోర్టు చేయడం బాధ్యత

విజయనగరం ఫోర్ట్: మందుల వలన కలిగే ప్రతికూల ప్రభావాలను రిపోర్టు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు సందర్భంగా బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందుల ప్రతికూల ప్రభావాలను రిపోర్టింగ్ చేయడం ద్వారా భవిష్యత్‌లో పరిశోధనలకు దోహద పడుతుందన్నారు. మందుల సురక్షిత వాడుకకు తోడ్పడుతుందన్నారు. మందులను వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శిరీష, డాక్టర్ షరీఫ్, డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలను పరిశుభ్రంగా నిర్వహించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత



విద్యార్థులతో మాట్లాడుతున్న బబిత

నెల్లిమర్ల: ప్రభుత్వ వసతిగృహాలను సంబంధిత సంక్షేమాధికారులు పరిశుభ్రంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశించారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వసతిగృహాన్ని, మహాత్మాజ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్(ఫిషర్‌మెన్)ను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్‌తో కలిసి ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, మెనూ అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో భోగాపురం సీఐ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయ ఏవో సుదర్శనం తతితరులు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో చిత్రలేఖన పోటీలు

విజయనగరం టౌన్: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న పోటీలు, అవగాహన సదస్సులు, శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో బుధవారం జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రకళా పోటీలను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వికసిత భారత్-2047లో భాగంగా ఈ నెల 17 నుంచి 23 వరకూ కళాశాల కచేరీ మందిరంలో ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 23న స్థానిక కళాకారుల చిత్రకళ ప్రదర్శన, బహుమతుల ప్రదానం, ముగింపు సభ ఉంటుందని ఆమె తెలిపారు.

గురజాడ విగ్రహం వద్ద శాంతి దీక్ష



శాంతిదీక్షలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

విజయనగరం టౌన్: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యం కోసమే అద్భుతమైన రచనలు చేసి ఆధునిక తెలుగు సాహిత్యానికి సరికొత్త రూపమిచ్చిన మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహించి ఆ మహాకవికి మహోన్నత ఘన నివాళులర్పించాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. జిల్లా పౌరవేదిక, ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి గురజాడ అప్పారావు విగ్రహం వద్ద శాంతిదీక్షను బుధవారం చేపట్టారు. గురజాడ ఇంటి వద్ద ముందుగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు దివంగత వావిలాల గోపాలకృష్ణయ్య 119వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా గురజాడ విగ్రహం వద్దకు చేరుకుని దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజా జయంతి రాష్ట్ర పండగగా నిర్వహించాలని ఇప్పటికే జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రికి వినతిపత్రం అందజేశామన్నారు. శాంతి దీక్షలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, దవడ కొండబాబు, మీనా, ప్రభాకరరావు, గెద్ద చిరంజీవి, జేవీవీ నాయకులు చీకటి దివాకర్, ఎమ్‌విఎస్.వెంకటరావు, డాక్టర్ ఎమ్.వెంకటేశ్వరరావు, ధవళ సర్వేశ్వరరావు, డాక్టర్ బి.ఎ.రావు, గురజాడ ఇందిర, ప్రసాద్‌లు, లలితా, త్యాడ బాలు, రామ్మోహన్, ఈశ్వరప్రసాద్, ముమ్మల తిరుపతిరావు, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల్లో దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలు



శరన్నవరాత్రుల దుర్గమ్మ అలంకరణ వివరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో కె.శిరీష తదితరులు

విజయనగరం టౌన్: శరన్నవరాత్రుల్లో పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో కొలువుదీరిన దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో కె.శిరీషా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కార్యాలయం ఆవరణలో అలంకరణల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గమ్మకు శ్రీ చక్ర కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 22న సోమవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా, 23న మంగళవారం గాయత్రీదేవి, 24న బుధవారం అన్నపూర్ణాదేవిగా, 25న గురువారం శ్రీకాత్యానీదేవిగా, 26న శుక్రవారం మహాలక్ష్మీదేవిగా, 27న శనివారం శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా, 28న ఆదివారం మహాచండీదేవిగా, 29న సోమవారం శ్రీ సరస్వతీదేవి (మూలానక్షత్రం)గా, 30న మంగళవారం దుర్గాష్టమి పురస్కరించుకుని దుర్గాదేవిగా, అక్టోబరు 1న బుధవారం మహిషాసుర మర్దినీదేవిగా, 2న గురువారం శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులందరూ పర్వదినాల్లో అమ్మవారి ప్రత్యేక అలంకరణలను దర్శించి, శ్రీచక్ర కుంకుమార్చనలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో శంబర ఈవో శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ వైవి.రమణి, కామేశ్వరి, రమేష్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.